51

# చినిగిన తెర సాక్ష్యము

*"యేసు మరల బిగ్గరగా కేకవేసి ప్రాణము విడిచెను. అప్పుడు దేవాలయపు తెర పైనుండి క్రిందివరకు రెండుగా చినిగెను; భూమి వణకెను; బండలు బద్దలాయెను; సమాధులు తెరవబడెను; నిద్రించిన అనేక మంది పరిశుద్ధుల శరీరములు లేచెను. వారు సమాధులలో నుండి బయటికి వచ్చి ఆయన లేచిన తరువాత పరిశుద్ధ పట్టణములో ప్రవేశించి అనేకులకు అగపడిరి" (మత్తయి 27:50-53).*

యేసు సిలువమీదనుండి ఏడు మారులు మాటలాడాడు. ఈ సమయంలో దేవుడు నాలుగు పర్యాయములు - చీకటి, తెర చినుగుట, భూమి వణకుట, మరియు సమాధులు

తెరవబడుట ద్వారా మాటలాడాడు. దేశమంతా చీకటి కమ్ముకొన్నప్పుడు, సిలువ చుట్టూర మధ్యాహ్నం మొదలుకొని మూడు గంటల వరకు అంతా నిశ్శబ్దమైనట్లగుపించింది. ఈ సమయంలో యేసు మాటలాడలేదు; కనీసం, ఒక వేళ మాట్లాడి యుండినా, అది లేఖనములలో లిఖింపబడలేదు.

మూడు గంటలకు చీకటి తొలగిపోయింది. అప్పుడు యేసు, కొద్ది నిమిషాల్లోనే అని స్పష్టమగుచున్నట్లు, ఒకటి తరువాత మరొకటి వరుసగాను త్వరత్వరగాను నాలుగు మాటలు పలికాడు: "నా దేవా, నా దేవా, నన్నెందుకు చెయ్యి విడిచితివి?"; "దప్పిగొనుచున్నాను"; "సమాప్తమైనది"; మరియు "తండ్రీ, నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నాను."[1] మొదటి మరియు చివరి పలుకులు బిగ్గరగా పలుకబడినవని స్పష్టంగా చెప్పబడింది.

యేసు తన తండ్రి చేతులకు తన "ఆత్మను అప్పగించుకొనిన" తరువాత, దేవాలయపు తెర "పైనుండి క్రింది వరకు రెండుగా చినిగినట్లు" అగుపించుచున్నది.

ఈ గడియ ముఖ్యమైనది. మధ్యాహ్నము మూడు గంటల సమయంలో, బల్యర్పణలు మొదలయ్యాయి. అనగా యాజకులందరు పరిశుద్ధ స్థలములో, బలిపీఠము దగ్గర, తెర ముందు నిలువబడి యున్నారని దీని అర్థం. వారు నిలువబడి యుండాలని దేవుడు కోరుకొన్న స్థలం కూడా సరిగ్గా ఇదే. ఈ గడియ నిత్యత్వములో కాలము ప్రారంభం కాకమునుపే నిర్ధారింపబడింది. క్రీస్తు మరణమునకు ప్రత్యక్షంగా అత్యంత బాధ్యులైనవారు తెర చినుగుట చూడవలసినవారై యుండిరి. వారు తెర ముందర నిలువబడియుండగా, వారి యాజకత్వ సేవలలో నిమగ్నమగుటకు సిద్ధపడినవారై, ఆకస్మికంగా కొద్ది దూరంలో వేయబడిన కేక విని, వారి కళ్ల ముందే తెర పైనుండి క్రింది వరకు రెండుగా చినుగుచుండగా చూచి దుఃఖముతో దిగ్భ్రాంతి చెంది స్తంభించిపోయారు.[2]

తెర చినిగిన తరువాత భూమి వణికింది, బండలు బ్రద్దలయ్యాయి. సమాధులు తెరవబడ్డాయి. తెర చినిగిన వెంటనే సంభవించిన భూకంపము దేవాలయమునకు ఎటువంటి నష్టము కలిగించలేదు. యాజకులందరు తెర చినిగిన అద్భుతమును కళ్లారా చూడగలుగునట్లు దేవాలయము మరియు దాని చుట్టుప్రక్కల ఉండిన కట్టడములకు కూడ ఎటువంటి నష్టము సంభవించకుండా ఉన్నపాటుననే నిలిచియుండినవి. తెర వ్రేలాడబడి యుండినది గనుక, భూకంపము చేత అది పైనుండి క్రింది వరకు చినుగుట సాధ్యము కాని పని. గనుక దీనిని చూచేవారెవరైనా కూడ ఇది దేవుని శక్తివంతమైన హస్తము చేసినపనే అని ఖచ్చితంగా గ్రహిస్తారు. యేసు మరణించుచుండినప్పుడును క్రైస్తవ యుగమునందును, లేఖనముల సాక్ష్యము ద్వారా, ఆయన కుమారుని మరణము ఆలయములందలి ఆరాధనను మరియు బల్యర్పణ పద్ధతిని అంతము చేసిందని దేవుడు లోకమునకు చాటిచెప్పుచుండెను.

దేవాలయమంతా వెలుపలి ప్రాంగణము, పరిశుద్ధ స్థలము, మరియు అతి పరిశుద్ధ స్థలముగా విభాగింపబడి యుండెను. దేవాలయము లోపలనే రెండు తెరలు వ్రేలాడుచుండినవి; యాజకులు సహితము దాని లోపలికి అపవిత్రంగా చూడకుండునట్లు ఒకటి పరిశుద్ధ స్థలమునకు ముందు. పరిశుద్ధ స్థలమును అతిపరిశుద్ధ స్థలము నుండి వేరు చేయుచు ఈ రెండింటి నడుమ రెండవ తెర ఉన్నది. రెండవది దేవుని నివాసమును కాపాడుచుండినది. రెండు పరిశుద్ధ స్థలములను వేరుచేయుచుండిన తెర, దాదాపుగా అరవై అడుగుల ఎత్తుగాను అతి సున్నితమైన నూలుతో తయారుచేయబడి పెద్దది మరియు ఖరీదైనదై యుండినది.

దేవాలయ ఆకృతిని ఆల్‌ఫ్రెడ్ ఎడెర్షీమ్ వివరిస్తూ ఇలా వ్రాస్తున్నాడు,

> అతి పరిశుద్ధ స్థలమునకు ముందుభాగంలో ఉండిన తెరలు 60 అడుగుల పొడవు, 30 అడుగుల వెడల్పు, ... మరియు 72 చచ్చవుకంగా ఉండిన భాగాలుగా ఉండి, ఒకదానితో నొకటి కలుపబడి యుండినవి; మరియు ఈ తెరలు, ఆ నాటి భాషలో అతిశయోక్తిగా చెప్పుకొను తీరులో, ఒక్కొక్క భాగమును కలుపుటకుగాని పరుచుటకుగాని 300 మంది యాజకులు అవసరమగునంత బరువైనవై యుండినవి. తెర టాల్మడ్‌లో వివరింపబడి యున్నట్లు ఉండినదైనట్లయితే, అది కేవలము ఒక భూకంపము చేత రెండుగా చినుగుటకు వీలు లేదు ..."[3]

తెరను పైనుండి క్రింది వరకు చింపుట ద్వారా, దేవుడు లోకమునకు మూడు భాగాలలో సాక్ష్యమునిచ్చాడు.

*పాప పరిహారమునకు అవసరమై యుండిన సంపూర్ణ బల్యర్పణ గావింపబడినదని చినిగిన తెర సాక్ష్యమిచ్చుచున్నది.* క్రీస్తు మరణము మానవుని పాపిష్టి దుస్థితి మరియు మానవున్ని దాని కోరలలో నుండి విమోచింపవలెనని దేవుడు కలిగియుండిన సంకల్పమును గూర్చినదై యుండింది. "దేవుని కృపామహదైశ్వర్యమునుబట్టి ఆ ప్రియునియందు ఆయన రక్తమువలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది" అని పౌలు వ్రాశాడు (ఎఫెసీయులకు 1:7).

మనలో అనేకులము వాణిజ్య లావాదేవీలకు సంబంధించి ఇటువంటి సాక్ష్యములు చూస్తాము. ఒక వ్యాపారవేత్త బ్యాంకు నుండి కొంత మొత్తమును రుణముగా తీసికొనునప్పుడు, పేర్కొనబడిన మొత్తమును ఆయన పొందుకొన్నాడని చెప్పుటకు దానికి సంబంధించిన ఒక రుణ చీటీపై తన చేవ్రాలు చేశాడు. బహుశ 90 రోజుల తరువాత ఆ వ్యాపారి తాను రుణముగా తీసుకొన్న అసలు మొత్తమును వడ్డీతోసహా తిరిగి చెల్లించాడనుకొనండి. అప్పుడు తిరిగి చెల్లింపబడిన పూర్తి మొత్తమును స్వీకరించిన అధికారి ఆ వ్యాపారి మూడు నెలల క్రితం చేవ్రాతలు చేసిన రుణచీటిని బయటికి తీస్తాడు. ఆయన ఆ రుణచీటీని వ్యాపారికి ఇవ్వవచ్చును, లేదా దానిని చింపివేసి చెత్తబుట్టలో వేయవచ్చును. ఇప్పుడు ఆ రుణచీటికి విలువగాని అర్థంగాని లేదు. ఎందుచేతనంటే రుణము చెల్లించబడింది.

ఇదే విధంగా, దేవుడు తెరను చింపివేశాడు.[4] శతాబ్దాలతరబడి ఈ తెర మానవుడు దేవునికి రుణపడియున్నాడనుటకు ఒక చిహ్నంగా నిలిచియుండునది. యేసు మరణించినప్పుడు, రుణము పూర్తిగా చెల్లించబడింది. దేవుడు రుణచీటిని చించేశాడు, తెరను రెండుగా పైనుండి క్రిందివరకు చింపాడు. "... దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞవలన మనమీద ఋణముగాను మనకు విరోధముగాను నుండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి, దాని మీది చేవ్రాతను తుడిచివేసి, మనకు అడ్డములేకుండ దానిని ఎత్తివేసి, ..." అని పౌలు వ్రాస్తున్నాడు (కొలొస్సయులకు 2:14).

*మోషే ధర్మశాస్త్రము చొప్పున నియమింపబడిన మానవ ప్రధానయాజకత్వము కొట్టివేయబడునదని కూడ చినిగిన తెర ప్రకటించుచున్నది.* ప్రతి సంవత్సరము మోషే యుగపు సందర్భములో, పాపపరిహారార్థ బల్యర్పన గావింపబడు ఆ గొప్ప దినాన, ఇశ్రాయేలీయుల ప్రధానయాజకుడు తన కొరకును ప్రజలందరి కొరకును ఉద్దేశింపబడిన రక్తముతో అతిపరిశుద్ధ స్థలములోనికి వెళ్లును (హెబ్రీయులకు 9:7; లేవీయులకు 16:14 చూడుము).

ఈ వాస్తవము మన ప్రభువు సిలువపై మరణించుటలో గల ద్వంద్వ కార్యసార్థకములను మనకు గుర్తుచేయుచున్నది. మొదటిదిగా, యేసు తననుతాను అవసరమై యుండిన బల్యర్పణ గా అర్పించుకొన్నాడు. ఆయన తన ప్రాణములోను శరీరములోను పాపముపట్ల గల దేవుని ఉగ్రతను భరించుచు, మన స్థానమును తీసికొన్నాడు. ఏదిఏమైనా, ఈ కార్యసార్థకముతో పాటు, ఇదే రీతిలో వర్తింపజేయుచు, రోజులు గడిచిన కొలది, పాపపరిహారార్థము కొరకైన ఈ బలియాగమును మన ప్రధాన యాజకుడుగా అర్పించును. హెబ్రీ పత్రిక రచయిత ఇలా వ్రాస్తున్నాడు, "కావున ప్రజల పాపములకు పరిహారము కలుగజేయుటకై, దేవుని సంబంధమైన కార్యములలో కనికరమును నమ్మకమునుగల ప్రధానయాజకుడగు నిమిత్తము, అన్ని విషయములలో ఆయన తన సహోదరులవంటి వాడు కావలసివచ్చెను" (హెబ్రీయులకు 2:17). "ఎవడైనను పాపము చేసినయెడల, నీతిమంతుడైన యేసుక్రీస్తు అను ఉత్తరవాది తండ్రియొద్ద మనకున్నాడు. ఆయనే మన పాపములకు శాంతికరమై యున్నాడు; మన పాపములకు మాత్రమేకాదు, సర్వలోకమునకును శాంతికరమైయున్నాడు" అని అపొస్తలుడైన యోహాను వ్రాస్తున్నాడు (1 యోహాను 2:1బి, 2).

క్రీస్తు తనను తాను బలిగావించుకొన్నాడు. "ఎవడును నా ప్రాణము తీసికొనడు, నా అంతట నేనే దాని పెట్టుచున్నాను" అని ఆయన చెప్పినప్పుడు ఆయన ఈ సత్యమును స్పష్టంచేశాడు (యోహాను 10:18ఎ). ఆయన క్రూరుల చేతిలో చిక్కిపోయిన నిస్సహాయుడైన బాధితుడై యుండలేదు; మనకు బదులైన బల్యర్పణగా ఆయన తనను తాను స్వేచ్ఛగా సిలువపై అర్పించుకొన్నాడు. ఏదిఏమైనా, మనము ఆయనను మిగిలియున్న కాలమంతటికిని గొప్ప ప్రధాన యాజకునిగా కూడ చూడాల్సి వున్నది. దేవుని పిల్లలగుటకు వెదకు ప్రతివానికిని ఆయన యెదుట నివసించియుండు దేవుని పిల్లలైనవారందరికిని ఆయన ఈ పరిపూర్ణమైన బల్యర్పణను వర్తింపచేయు గొప్ప ప్రధాన యాజకుడై యున్నాడు. ఆయన ఈ పరిపూర్ణమైన బలియాగమును చేయుటద్వారాను, ఆయన యొద్దకు వచ్చువారందరికి మరియు ఆయన యందు నివసించియుండువారందరికి దీనిని పరిపూర్ణంగా వర్తింపజేయుటద్వారాను. ఆయన ఇహలోక ప్రధాన యాజకుని పదవిని శాశ్వతంగా తీసివేశాడు.

*ఇప్పుడు యేసు రక్తము చేత విమోచింపబడినవారు దేవుని సన్నిధికి వచ్చుటకు ఉచితమును, అనవరతమును అందుబాటులో నుండి అతి సమీప మార్గమును సమకూర్చునని చినిగిన తెర చాటిచెప్పుచున్నది.* దేవునికిని మానవునికిని మధ్య ఉండిన అడ్డంకిని అది నిర్మూలించినది. మానవుడు దేవుని సన్నిధిలోనికి ప్రవేశించుటకు మార్గాన్ని సరళము చేసింది. "మరియు ఆయన వచ్చి దూరస్థులైన మీకును సమీపస్థులైన వారికిని సమాధాన సువార్తను ప్రకటించెను. ఆయన ద్వారానే మనము ఉభయులము ఒక్క **ఆత్మ**యందు తండ్రి సన్నిధికి చేరగలిగియున్నాము" అని పౌలు వ్రాస్తున్నాడు (ఎఫెసీయులకు 2:17, 18). ఆయన మరణము ద్వారా, తెర చినిగినప్పుడు, సమస్త మానవులు తండ్రి సన్నిధికి చేరుటకు మార్గము తెరువ బడింది. యాజకునికిని అరాధించువానికిని మధ్య నుండిన గోడ తొలగించబడింది. ఇప్పుడు సంఘము ఒక పరిశుద్ధ యాజకత్వమై యున్నది (1 పేతురు 2:5). ఇప్పుడు అందరును దేవుని యొద్దకు యేసు క్రీస్తు ద్వారా చేరుటకు మార్గము అందుబాటులో ఉన్నది.

యేసు మరణముతో, దేవాలయ ఆరాధనలు ముగిసినవి. క్రీ.శ. 70లో తీతు మరియు రోమా సైన్యముచేత ఆలయము ధ్వంసము చేయబడునట్లు దేవుడు అనుమతించాడు. అతి

పరిశుద్ధ స్థలము పరలోక సింహాసనా స్థలమునకు ఛాయయు సాదృశ్యమునై యుండినది (హెబ్రీయులకు 8:1, 2; 9:2–9ఎ). మనము దేవుని యొద్దకు చేరుటకు గల మార్గము – మన స్వంత మంచితనమునుబట్టి కాదు, కానీ క్రీస్తు యొక్క మరణమునుబట్టియే అందుబాటులో ఉన్నదని చినిగిన తెర ప్రకటించుచున్నది. విధేయులైన విశ్వాసులు, దేవుని యొద్దకు ఎల్లప్పుడును ధైర్యముతో చేరగల యాజక సమూహమయ్యారు.

యేసు తన ఆత్మను దేవునికి అప్పగించుకొన్న అదే క్షణములో తెర పైనుండి క్రిందివరకు చినుగుటనుబట్టి వారి మనోభావములలో ప్రభావితము కానివారేవరున్నారు? తెర చినుగుట యను ఈ అద్భుతము యాజకులలో కొందరు క్రైస్తవులగుటకు అది వారిని నిర్బంధించి యుండవచ్చును. "దేవుని వాక్యము ప్రబలమై శిష్యుల సంఖ్య యెరూషలేములో బహుగా విస్తరించెను; మరియు యాజకులలో అనేకులు విశ్వాసమునకు లోబడిరి" అని తన నివేదికలో లూకా అటుతరువాత తెలియజేయుచున్నాడు (అపొస్తలుల కార్యములు 6:7). పాపమునకు చెల్లింపబడవలసి యుండిన వెల చెల్లింపబడిందనియు, ఇహలోకపు యాజకత్వము నిలిచిపోయిందనియు, దేవుని సన్నిధిలోనికి చేరుటకు అంతరాయములేని అందుబాటును యేసు రక్తము సమకూర్చుచున్నదనియు చినిగిన తెర చాటి చెప్పుచున్నది.

❖◆❖◆❖

*దేవుని సన్నిధిలోనికి వెళ్లుట మరణమును కొనితెచ్చుకొన్నట్లేయని చెప్పిన ఒక కాలముండినది; కానీ ఇప్పుడు దేవుని సన్నిధిలోనికి రాకుండా వెలుపల ఉండుటయే మరణమై యున్నది.*[5]

*"సహోదరులారా, యేసు మనకొరకు ప్రతిష్ఠించిన మార్గమున, అనగా నూతనమైనదియు జీవముగలదియు, ఆయన శరీరము అను తెరద్వారా యేర్పరచబడినదియునైన మార్గమున, ఆయన రక్తమువలన పరిశుద్ధస్థలమునందు ప్రవేశించుటకు మనకు ధైర్యము కలిగియున్నది గనుకను, దేవుని యింటిపైన మనకు గొప్ప యాజకుడున్నాడు (హెబ్రీయులకు 10:19–21).*

---

సూచనలు

[1]మత్తయి 27:46; మార్కు 15:34; యోహాను 19:28, 30; లూకా 23:46. [2]Gordon H. Girod, *Words and Wonders of the Cross* (Grand Rapids, Mich.: Baker Book House, 1962), 114. [3]Alfred Edersheim, *The Life and Times of Jesus the Messiah,* new updated ed. (Peabody, Mass.: Hendrickson Publishers, 1993), 894. [4]Adapted from Girod, 113-14. [5]Adapted from David Brown, "Matthew," in Robert Jamieson, A. R. Fausset, and David Brown, *A Commentary, Critical and Explanatory, on the Old and New Testaments* (Louisville: Pentecostal Publishing Co., c. 1878), 61.